
సాక్షి
సూర్యాపేట

గురువారం । 18 । మే । 2023



ఏడుగురి అరెస్ట్

ద్విచక్రవాహనదారులే టార్గెట్‌గా దారి దోపిడీలకు పాల్పడుతున్న ఏడుగురిని అనంతగిరి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. - 8లో



కూలికి వెళ్తూ మృత్యుఒడికి

నర్సాపురానికి చెందిన ఆరుగురు కూలీలు బుధవారం పొందుగల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. - 8లో

గరిష్టం/కనిష్టం
42°/29°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పూట సూర్యరశ్మి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట క్రైం: సూర్యాపేట పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర మహిళా పోలీస్ భరోసా సెంటర్‌లో పని చేసేందుకు సర్వీస్ రెగ్యులరైజేషన్ హక్కులు లేకుండా కాంట్రాక్టు ప్రాతిపదికన సెంటర్ కో ఆర్డినేటర్, సపోర్ట్ పర్సన్‌గా పనిచేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెంటర్ కో ఆర్డినేటర్ ఒకటి, సపోర్ట్ పర్సన్ ఒక పోస్టు ఏడాది కాలానికి నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ ఆవశ్యకత, బడ్జెట్ ప్రకారం ప్రతి సంవత్సరం పొడిగించనున్నట్లు తెలిపారు. డి బిజినెస్ సొల్యూషన్స్ ఏజెన్సీ ద్వారా నియామకాలు చేపడుతున్నారని బయో డేటా, ఎడ్యుకేషనల్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం

సూర్యాపేట క్రైం: లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. జూన్ 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కోర్టు డ్యూటీ పోలీసు అధికారులు, కోర్టు లైజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. రాజీకి, పరిష్కారానికి అవకాశం ఉన్న కేసులను ముందుగా గుర్తించాలని, వీటిని విభజించుకొని ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది టీమ్‌లుగా ఏర్పడి పని చేయాలన్నారు. కేసుల్లో ఇరు వర్గాల వారికి జాతీయ లోక్ అదాలత్ ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో పోలీసులు సమన్వయంతో పని చేయాలని కోరారు. బాగా పనిచేసే సిబ్బందికి రివార్డ్స్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించొద్దు



ఈటూరులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నాగారం : గ్రామాల్లో నిర్వహించే పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు నిబద్ధతతో పనిచేసి, పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. రోడ్లు, వీధుల వెంట ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించాలని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి మురుగు కాలువలు, సీసీరోడ్లు, వీధులు పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ గాలి శోభారాణి, ఎంపీఓ ధార శ్రీనివాస్, ఏపీఓ రవి, సర్పంచ్ పేరాల సరిత యాదగిరి, కార్యదర్శి భవాని పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ బాణాల కవిత

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ 6వ స్థాయీ సంఘం చైర్ పర్సన్ బాణాల కవిత ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో 6వ స్థాయీ సంఘం సమావేశం ఆమె అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మంజూరైతే ముందుగా ఆ వివరాలు ప్రజాప్రతినిధులకు తెలియజేయడం వల్ల గ్రామాల్లో లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. కొన్ని మండలాల్లో అధికారులు ప్రొటోకాల్‌పాటించడం లేదని, ప్రజాప్రతినిధులను వివిధ ప్రారంభోత్సవాలకు తప్పకుండా ఆహ్వానించాలన్నారు. రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టినందుకు సీఎం కేసీఆర్‌కు, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉమ, భిక్షం, మాలోతు బుజ్జి, జెడ్పీ సీఈఓ సురేష్, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎండలకు జర పైలం

- భగ్గుమంటున్న భానుడు
- అత్యధికంగా మోతెలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత
- మరో 14 మండలాల్లో 43 డిగ్రీలకు పైగా నమోదు
- జనం బయటికి వెళ్లొద్దని వైద్యుల సూచన





సూర్యాపేట పట్టణంలో ఎండలకు నిర్మానుష్యంగా మారిన రైతు బజార్ రోడ్డు

భానుపురి, సూర్యాపేట : జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. ఈ సీజన్లోనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ వస్తున్నాయి. బుధవారం జిల్లాలోని మోతె మండలంలో 45.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా తుంగతుర్తి మండలంలో 40.5 డిగ్రీలు ఉంది. మొత్తంగా 14 మండలాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. అధిక ఉష్ణోగ్రతలకు తోడుగా వడగాల్పులతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సూర్యుడు సుర్రుమంటూ సాయంత్రం 6 గంటల వరకు తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారితో పాటు ఇళ్లలో ఉంటున్న ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వీధి వ్యాపారులు సైతం ఎండ తీవ్రతకు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ రైతులు, కూలీలు అవస్థలు పడుతున్నారు. ఉదయం 11 గంటలు దాటితే చాలు గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలల్లోనూ రహదారులన్నీ జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు గర్భిణులు, బాలింతలు సూర్యుడి ప్రతాపానికి తట్టుకోలేక పోతున్నారు. వడదెబ్బతో పలువురు అనారోగ్యానికి గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పెంపుడు జంతువులు, పశువులు, మూగజీవాలు సైతం విలవిలలాడుతున్నాయి. ఎండబారిన పడకుండా వైద్యులు, పశువైద్యుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

వడదెబ్బకు గురైతే తడిబట్టతో తుడవాలి



- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు చిన్న పిల్లలు బయటకు రావొద్దు. వడదెబ్బకు గురైతే వెంటనే తడి బట్టతో ఒళ్లంతా తుడిచి దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలి .
- ఎంత ముఖ్యమైన పనులు ఉన్నా సరే.. ఉదయం 9 గంటలలోపే చేసుకొని ఇళ్లకు చేరుకోవాలి. సాయంత్రం 6 గంటల తర్వాత మళ్లీ బయటికి వచ్చి పనులు చేసుకోవాలి.
- బీపీ వ్యాధి గ్రస్తులు టెలిస్మాత్ - హెచ్ మెడిసిన్ కాకుండా.. టెలిస్మాత్ ప్లెయిన్ మెడిసిన్‌ను ఎండాకాలం ముగిసేంత వరకు వేసుకోవాలి. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ఎండలో తిరగకుండా ఉండేలా చూసుకోవాలి.
- వడదెబ్బకు గురైతే వెంటనే ఒళ్లంతా తడిబట్టతో తుడిసి ఆస్పత్రులకు తీసుకువెళ్లాలి.
- రోజులో 3 నుంచి 5 లీటర్ల నీరు తాగితే వడదెబ్బ తగలకుండా ఉంటుంది.
- ఎక్కువ సార్లు కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తాగాలి.

– డాక్టర్ వూర రాంమూర్తి యాదవ్, ఫిజీషియన్

ఉమ్మనీరు తగ్గిపోయే ప్రమాదం ఉంది



- గర్భిణులు ఎండలో తిరిగితే ఉమ్మనీరు తగ్గిపోయే ప్రమాదముంది.బాలింతలకు పాలు తగ్గుముఖం పడతాయి. గర్భిణులు డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా రోజూ 4 నుంచి 5లీటర్ల నీటిని తాగాలి.
- నీరు అధికంగా ఉన్న కూరగాయలు, పండ్లు మాత్రమే తినాలి. వదులుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించాలి. బాదాం, వాల్‌నట్స్ తీసుకోవాలి.
- వడదెబ్బ వల్ల తలనొప్పి ,డీ హైడ్రేషన్ అవుతుంది.
- బాలింతలు కూడా ఎండకు వెళ్లవద్దు. పాలు తగ్గే అవకాశం ఉంది.
- పిల్లలకు పాలు ఇచ్చే సమయంలో రొమ్ములను శుభ్రం చేసి పాలు పట్టించాలి.

– డాక్టర్ స్రవంతి, గైనకాలజిస్ట్

ఉదయం, సాయంత్రం వేళల్లో మేపాలి



- ఎండలకు పశువులు వడదెబ్బకు గురై ఉత్పాదక శక్తిని కోల్పోవడమే కాకుండా మరణం కూడా సంభవించే అవకాశముంటుంది. ఈ నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఇళ్లలో పెంపుడు జంతువులను సాకే వారు శ్రద్ధ వహించాలి
- పశువులు, గొర్రెలు, మేకలను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లోనే మేపడానికి తీసుకెళ్లాలి. ఎండ తీవ్ర ఉన్నప్పుడు కొట్టాల్లో లేదంటే చెట్ల నీడలో ఉంచాలి.
- పశుగ్రాస వసతి ఉన్నట్లయితే షెడ్ లోపల మేపడమే మంచిది.
- కొట్టాలు, షెడ్‌ల చుట్టూ నీడనిచ్చే చెట్లను పెంచాలి.
- పరిశుభ్రమైన నీటిని అందుబాటులో ఉంచాలి. రోజుకు ప్రతి పశువుకు సుమారు 60 నుంచి 70 లీటర్ల తాగునీరు అవసరం.
- వీలైనంత ఎక్కువగా పచ్చిమేత అందించాలి. దాణా అయితే తడిపి ఇవ్వాలి.
- వడదెబ్బకు గురైన పశువుల శరీర ఉష్ణోగ్రత పెరిగి భారంగా శ్వాసతీసుకుంటాయి. అలాంటివాటికి వెంటనే తల, శరీర భాగాలను నీటితో తడుపుతూ సమీపంలోని పశు వైద్యాధికారిని సంప్రదించాలి.
- ఇక పక్షులకు ఇళ్లలో నీటిని అందుబాటులో ఉంచాలి.
- పెంపుడు కుక్కలను ఎక్కువగా చల్లటి ప్రాంతాల్లో ఉంచి సంరక్షించుకోవాలి.
- మధ్యాహ్న సమయంలో బయటికి పంపించకుండా ఉదయం, సాయంత్ర వేళల్లోనే వదలాలి.

– శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

సోడియం, పొటాషియం తగ్గిపోతుంది



- గుండె వ్యాధి గ్రస్తులు ఈ వేసవిలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎండలో ఎక్కువగా తిరిగినా, ఉన్నా శరీరం డీ హైడ్రేషన్‌కు గురై సోడియం, పొటాషియం తగ్గిపోతుంది. దీంతో గుండె నిమిషానికి 72 సార్లు కొట్టుకోవాల్సి ఉండగా.. 40 సార్లకు పడిపోయి వాల్స్ బ్లాక్ అవుతాయి.
- సాధారణ రోగుల కంటే కూడా గుండె వ్యాధి గ్రస్తులకు మూత్రం ఎక్కువగా నడిచే మెడిసిన్ ఉంటుంది. కాబట్టి వారికి డీ హైడ్రేషన్ అవుతుంది. వీలైనంత త్వరగా పనులు ముగించుకొని ఎండలో తిరగడం మానుకోవాలి.
- పులుపు, మసాలాలు, మటన్, చికెన్ తినవద్దు. ఎక్కువగా కూరగాయలతో వండిన ఆహార పదార్థాలు మాత్రమే తినాలి.
- దూర ప్రాంతాలకు ప్రయాణాలు ఈ మూడు నెలల కాలం మానుకోవాలి. వాకింగ్ కూడా ఉదయం 7 గంటల లోపు.. సాయంత్రం 6 దాటిన తర్వాత చేయాలి.

– డాక్టర్ అలుక ప్రేమ్‌కుమార్, గుండె వైద్యనిపుణులు

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా..

మండలం	కనిష్టం	గరిష్టం
మోతె	35.8	45.2
గరిడేపల్లి	36.2	44.6
మునగాల	37.5	44.5
హుజూర్‌నగర్	38.0	44.0
మఠంపల్లి	36.9	43.9
చివ్వెంల	35.5	43.8
పెన్‌పహాడ్	35.9	43. 5
నడిగూడెం	36.0	43.4
అనంతగిరి	34.0	43.4
నేరేడుచర్ల	36.1	43.3
పాలకవీడు	36.2	43.3
చిలుకూరు	36.8	43.1
ఆత్మకూర్ ఎస్	35.4	43.1
చింతలపాలెం	33.7	43.1
జాజిరెడ్డిగూడెం	35.2	43.0
కోదాడ	35.7	42.6
మద్దిరాల	32.2	42.5
మేళ్లచెరువు	37.1	42.5
నాగారం	34.9	42.5
సూర్యాపేట	34.4	42.4
నూతనకల్	35.1	41.6
తిరుమలగిరి	34.2	40.8
తుంగతుర్తి	35.3	40.5

బాలబాలికలకు పౌష్టికాహారం అందించాలి

- కలెక్టర్ వెంకట్రావు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాల, బాలికలకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రంలో పెడుతున్న ఆహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ముచ్చటించారు. అక్షరాలు, రైమ్స్ వారితో చెప్పించారు. చిన్నారుల శరీరం బరువును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కలెక్టర్‌తో పాటు అర్బన్ సీడీపీఓ కిరణ్మయి, జయమ్మ పాల్గొన్నారు.

బియ్యం నాణ్యతలో తేడాలు ఉండొద్దు

సూర్యాపేట: బియ్యం నాణ్యతలో ఎటువంటి తేడాలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ వెంకట్రావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని శాంతినగర్‌లో గల కేంద్ర గిడ్డంగుల సంస్థ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములో నిల్వ ఉన్న బియ్యం నాణ్యత, పాటిస్తున్న నియమ నిబంధనలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఎం రాంపతి, డిపో మేనేజర్ వెంకన్న, సాంకేతిక సిబ్బంది సువర్ణ పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ అభివృద్ధికి కృషి

తిరుమలగిరి (తుంగతుర్తి) : జిల్లాలో బాస్కెట్ బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని తుంగతుర్తి శాసన సభ్యుడు గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. సూర్యాపేట జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాస్కెట్ బాల్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో జిల్లా కేంద్రంలో బాస్కెట్ బాల్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు శాలువాలతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఫారూఖ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి, మండల పార్టీ అధ్యక్షులు రఘునందన్‌రెడ్డి, ఉప్పలయ్య, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్‌కుమార్, కందుకూరి లక్ష్మయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ఎమ్మెల్యే కిశోర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాలీసెట్‌కు 3,007 మంది హాజరు



ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



తిరుమలగిరి మోడల్ స్కూల్‌లో హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సూర్యాపేటటౌన్, తిరుమలగిరి : పాలీసెట్ -2023 బుధవారం జిల్లాలోని సూర్యాపేట, తిరుమలగిరి పట్టణాల్లో ప్రశాంతంగా జరిగింది. 11 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా మొత్తం 3,280 మంది విద్యార్థులకు 3,007 మంది హాజరుకాగా 276 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. సూర్యాపేట పట్టణంలో తొమ్మిది సెంటర్లలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 2,932 మంది విద్యార్థులకు 2,684 మంది హాజరు కాగా 251 మంది గైర్హాజరయ్యారు. 91.43శాతం మంది విద్యార్థులు పరీక్ష రాశారు. జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రాలను డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ నర్సింహారావు తనిఖీ చేశారు. ప్రశాంతంగా పరీక్ష జరిగినట్టు ఆయన తెలిపారు. తిరుమలగిరిలో రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా మొత్తం 348 మంది విద్యార్థులకు 323 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు. 92.81 శాతం విద్యార్థులు పరీక్షలు రాశారు. తిరుమలగిరిలో రెండు కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు.

21న ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ డైరెక్టర్ చిట్టిపాక రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్ష జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందని పేర్కొన్నారు. హాల్ టికెట్‌లు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9989129935 ను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

ఎంజీయూ (నల్లగొండ రూరల్): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మిర్యాల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ కళాశాల విజ్ఞప్తి మేరకు 3, 4, 5, 6 సెమిస్టర్లు (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) పరీక్షలు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు పాటుపడతా

- డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్

భానుపురి (సూర్యాపేట) : మరింత బాధ్యతగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రెండోసారి డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పట్టణ అధ్యక్షుడు ఎండీ.అంజద్‌అలీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైరు శైలేందర్‌గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కోదాడ మాజీ శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై బాధ్యత మరింత పెరిగిందని, పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ ఎస్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందాల వెంకట్ రెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లింగస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కుంట్ల వెంకట నాగిరెడ్డి, కార్యదర్శులు నాగుల వాసు, పిడమర్తి మల్లయ్య, అక్కేనపల్లి జానయ్య, చెరుకు రాము, అధికార ప్రతినిధి కుండమల్ల శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్న మధుకర్ రెడ్డి, పట్టణ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రెబల్ శ్రీను, పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ యలగందుల సాయినేత, రెడ్ హౌస్ ఇన్‌చార్జ్ నరేందర్ నాయుడు, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్, నాయకులు గడ్డం వెంకన్న, పందిరి వెంకన్న, ఓరుగంటి నాగేశ్వర్ రావు, అన్నమయ్య రాము, కోడి శివ, అబ్బాస్, అశోక్‌యాదవ్, కుమార్ యాదవ్, మండలి సంజయ్, మహేష్ పాల్గొన్నారు.



చెవిటి వెంకన్నయాదవ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

ఎన్నికలకు రెడీ!

- ప్రజల్లో ఉండేలా కార్యాచరణ రూపొందిస్తున్న పార్టీలు
- 19న కోదాడ, హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ సమావేశాలు
- ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన బీఆర్ఎస్
- రైతులతో చెరువుల వద్ద ప్రత్యేక సమావేశాలకు సిద్ధం



ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించగా ఈసారి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై రైతులతో సమావేశాలకు సిద్ధమవుతోంది. ఇక కాంగ్రెస్ పార్టీ.. అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు రెడీ అయ్యింది. బీజేపీ కూడా ఈ నెలలో నిర్వహించే రాష్ట్ర కార్యవర్గ సమావేశాల అనంతరం జిల్లాలో కార్యక్రమాలకు రూపకల్పన చేయనుంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సెప్టెంబర్ నెల చివరలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావచ్చని, నవంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న అంచనాతో అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లతో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ బుధవారం హైదరాబాద్‌లో ఎన్నికల కార్యాచరణపైనే ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. తొమ్మిదేళ్లలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని, ముఖ్యంగా రైతులపై దృష్టిసారించాలని సూచించారు. రైతులను చెరువుల వద్దకు పిలిచి సమావేశాలు పెట్టాలని, వారితో భోజనాల కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వం అందిస్తున్న చేయూతను వివరించడం ద్వారా వారికి మరింత దగ్గరయ్యేలా ప్రణాళికలను రూపొందించుకోవాలని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా కార్యాచరణపై విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దృష్టిసారించారు.

సమావేశాలతో సన్నద్ధం

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అందరికంటే ముందుగానే ఎన్నికల కార్యాచరణ రూపకల్పనపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాలకు శ్రీకారం చుట్టింది. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 19న కోదాడ, హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం ఉదయం కోదాడలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కోదాడ నియోజకవర్గం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. అలాగే సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు హుజూర్‌నగర్‌లోని గడ్డిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో ప్రతి పది మంది కాంగ్రెస్ కార్యకర్తలతో బూత్ కమిటీలు ఏర్పాటు చేసి, 100 మంది ఓటర్లకు ఒక కోఆర్డినేటర్‌ను నియమించి ఎన్నికలకు సమాయత్తం చేయనున్నారు. గ్రామస్థాయి కమిటీల నిర్మాణం, సోషల్ మీడియా ప్రచార కార్యక్రమాల రూపకల్పన, ప్రతి ఓటర్‌కు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం చేరేలా ప్రణాళికలపై చర్చించి ఖరారు చేయనున్నారు. భూదందాలు, వాటిల్లో అధికార పార్టీ నేతల పాత్ర, అధికారుల అవినీతి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా చర్చించనున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర : మండల పరిధిలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ స్వర్ణలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–23విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదోతరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని, 01–06–2006 నుంచి 01–07–2008 మధ్య జన్మించిన విద్యార్థులు ప్రవేశపరీక్షకు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్‌సైన్స్ సబ్జెక్టులలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష జూలై 22న నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

చిట్యాల: వడదెబ్బతో వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన చిట్యాల పట్టణంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డుకు చెందిన జిట్ట లింగమ్మ(60) కొంతకాలంగా స్థానిక ఆలయాల ఎదుట భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మూడు రోజులుగా వీస్తున్న వేడిగాలులతో పాటు, ఎండ వేడిమికి తీవ్ర అస్వస్థతకు గురై మంగళవారం రాత్రి మృతిచెందింది. మృతదేహాన్ని చంద్రయ్య, బొందయ్య, కృష్ణ, నర్సింహ, సందర్శించి నివాళులర్పించారు.

కూలికి వెళ్తూ మృత్యుఒడికి

- రోడ్డుప్రమాదంలో ఆరుగురు మహిళా కూలీలు దుర్మరణం
- మృతులంతా నల్లగొండ జిల్లా వాసులే
- ఆటోను లారీ ఢీకొనడంతో దుర్ఘటన
- ఆర్తనాదాలతో మార్మోగిన ఘటనా స్థలం

కూలి కోసం కొండంత ఆశతో వేకువజామునే బయలుదేరిన ఆ పేద బతుకులపై విధి కన్నెర్రచేసిందో ఏమో.. కబుర్లు చెప్పుకుంటూ సరదాగా ఆటోలో వెళ్తున్న మహిళలపైకి ఒక్కసారిగా లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఆరుగురిని పొట్టనపెట్టుకుంది. ఫలితంగా అప్పటివరకు సాగిన ముచ్చట్లు ఆహాకారాలుగా మారాయి. కొద్దిసేపాగితే పని ప్రదేశానికి చేరుకుంటారనగా ఈ ఘోరం జరగడంతో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. విషయం తెలిసి గుండెలు బాదుకుంటూ వచ్చిన బంధువుల రోదనలతో దిక్కులుపిక్కటిల్లాయి. ఈ హృదయ విదారక ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దాచేపల్లి మండలం పొందుగల వద్ద బుధవారం జరిగింది.





సంఘటనా స్థలంలో కూలీల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

దాచేపల్లి : దామచర్ల మండలం నర్సాపురానికి చెందిన మహిళా వ్యవసాయ కూలీలు బుధవారం వేకువ జామునే గురజాల మండలం పులిపాడులో జరుగుతున్న మిర్చి కోతలకు ఆటోలో పయనమయ్యారు. ఆటో దాచేపల్లి మండలం పొందుగల వద్దకు వచ్చేసరికి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో మాలోతు కవిత(45), ఇస్లావత్ మంజుల(30), భూక్యా పద్మ(26), భూక్యా సోనీ(58), వర్తియా సక్రీ(35) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఇస్లావత్ పార్వతి(45)తోపాటు మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పార్వతిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. మిగిలిన వారిని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు

ప్రమాదంలో మరణించిన ఆరుగురి కుటుంబాలదీ రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితే. నర్సాపురంలోని సుగాలీ కాలనీకి చెందిన వీరంతా ఉన్న ఊరిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పులిపాడు గ్రామానికి కొన్నిరోజులుగా వస్తున్నారు. రోజూలాగానే బుధవారం తెల్లవారుజామునే ఆటోలో 12మంది మహిళా కూలీలు పనులకు బయలుదేరారు. మార్గమధ్యలో ప్రమాదం జరిగి ఆరుగురు మరణించారు. తెల్లవారుజామునే ఇంట్లో నిద్రిస్తున్న బిడ్డలకు ముద్దు ఇచ్చి పనికి ఎల్లొస్త.. అంటూ చిరునవ్వుతో బయలుదేరిన వీరిని ఘటనాస్థలంలో విగతజీవులుగా చూసి వారి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్నారు.

అమ్మా ఒక్కసారి లేమ్మా..

మంజుల కుమార్తె నాగమణి ఘటనాస్థలంలో రోదించిన తీరు చూపరులను కలచివేసింది. 'బిడ్డా కూలిపోయొస్త.. మధ్యాహ్నానికి వచ్చేస్త అని చెప్పావు కదమ్మా.. లెగమ్మా.. నాన్నా అమ్మను ఓసారి లెగమను' అంటూ ఆమె విలపించిన తీరు కంటతడి పెట్టించింది. తండ్రి రంగా బిడ్డను అక్కున చేర్చుకుని ధైర్యం చెప్పినా ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. మంజులకు నాగమణి తోపాటు కుమారుడు ఈశ్వర్ ఉన్నారు.

- అలాగే ప్రమాదంలో మరణించిన కవితకు భర్త, కృష్ణ, కుమార్తెలు అంజలి, సరిత, కుమారుడు ధనుష్ ఉన్నారు.
- పద్మకు భర్త భిక్షు, కుమారులు దీపక్, విక్షన్, సక్రికి భర్త సక్రు, కుమార్తెలు అంజలి, దేవిక ఉన్నారు.
- సోనీ భర్త చనిపోవడంతో కుమారుల వద్ద ఉంటూ కూలిపనులకు వస్తోంది.

ఒకవైపే రోడ్డు.. ఆపై ఆగి ఉన్న లారీలు

ఏపీ నుంచి తెలంగాణకు వెళ్తున్న ధాన్యం లారీలను సరిహద్దు వద్దే తెలంగాణ ఆర్టీఓ అధికారులు నిలిపివేస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి లారీలను నిలిపివేయటంతో పొందుగల గ్రామంలోనూ రోడ్డు పక్కనే లారీలు నిలిచాయి. పిడుగురాళ్ల వైపు నుంచి వస్తున్న ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ధ్యానం లారీలను దాటుకుంటూ వెళ్తున్న నేపథ్యంలో ఎదురుగా తెలంగాణ నుంచి కూలీలతో వస్తున్న ఆటోను గమనించకపోవటంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ధాన్యం లారీలు నిలిపివేయకుంటే ఈ ప్రమాదం జరిగేదికాదని పేర్కొంటున్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

గురజాల : ప్రమాదంలో మరణించిన ఐదుగురి మృతదేహాలకు గురజాల వైద్యశాలలో పోస్టుమార్టం పూర్తయింది. దీంతో పోస్టుమార్టం గది వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి.

పరామర్శించిన ఎమ్మెల్యే కాసు, జానారెడ్డి

మృతదేహాలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి , ఉమ్మడి రాష్ట్ర హోంశాఖ మాజీ మంత్రి కుందురు జానారెడ్డి సందర్శించారు. అనంతరం మృతుల బంధువులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కూలీల మృతి బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబసభ్యులకు, చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు వారు ఆర్థికసాయం అందించారు. ప్రమాద వివరాలను డీఎస్పీ పల్లపురాజును అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఝెను ముల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, తదితరులు ఉన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఈ ప్రమాదంలో క్షతగాత్రులైన వారిని బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు పలువురి పరామర్శ

మిర్యాలగూడ: కూలీలు మృతిచెందిన విషయం తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రమాద తీవ్రతను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.10వేలు ఆయన అందజేశారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఆంగోతు లలితాహాతీరాం నాయక్, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు వీరకోటిరెడ్డి, ఎండీ యూసుఫ్, ఎంపీటీసీ బాలలక్ష్మీసత్యనారాయణ, పెద కోటిరెడ్డి, ధీరావత్ పాచునాయక్ ఉన్నారు.



మార్చురీలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి: జూలకంటి

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించి, పక్కా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. మృతుల కుంటుబ సభ్యులను, క్షతగాత్రులను బుధవారం ఆయన పరామర్శించారు. ఆయన వెంట సీపీఎం నాయకుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, వినోద్ నాయక్, పాపానాయక్ దయానంద్ తదితరులు ఉన్నారు.

బీఎల్ఆర్ ఆర్థికసాయం

ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలను మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి పరామర్శించారు. దహన సంస్కారాల నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

'మన ఊరు–మనబడి' పనులను వేగవంతం చేయాలి

- జెడ్పీ సీఈఓ జి.సురేష్



నర్సరీ రికార్డులు పరిశీలిస్తున్న సీఈఓ సురేష్

మునగాల(కోదాడ) : మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన మనఊరు–మనబడి పథకంలోని పనులను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ జి.సరేష్ అన్నారు. బుధవారం మండలంలోని విజయరాఘవపురం, రేపాల, నర్సింహులగూడెం గ్రామాల్లో మనఊరు–మనబడి పనులతో పాటు ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఐకేపీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో మొక్కలు విరివిగా నాటేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం సిద్ధంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.భూపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ వసంత, విజయరాఘవపురం, రేబల్లే, రేపాల, నర్సింహులగూడెం గ్రామాల సర్పంచ్‌లు, పల్లి రమణ, కొప్పు ప్రమీల, కార్యదర్శులు సుధాకర్, బ్రహ్మరెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీరోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ జిల్లా అధికారి లలిత

మఠంపల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ జిల్లా అధికారి లలిత అన్నారు. బుధవారం మండలంలోని మంచ్యాతండాలో ఆమె పర్యటించి సీసీ రోడ్లు, ఉపాధి హామీ పథకంలో చేపట్టిన మట్టి పనులు, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అక్రమాలకు పాల్పడితే చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట సర్పంచ్ మీనా, టీఏ నరసింహ, కార్యదర్శి ప్రవీణ్, తదితరులున్నారు.

వాగులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

హుజూర్‌నగర్‌రూరల్ : వాగులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. హుజూర్‌నగర్ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతారాంపురం వద్ద గల వేమూలూరి వాగులో గ్రామానికి చెందిన గంటసాల రామాంజనేయులు, ఉర్లుగొండ వెంకన్న చేపల వేటకు వెళ్లారు. కాగా, వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో గ్రామ సర్పంచ్ అద్దంకి సైదేశ్వరరావు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచారు. మృతుడికి సుమారు 40 సంవత్సరాల వయసు ఉంటుందని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కారు పల్టీ.. నలుగురికి గాయాలు

- వీరిలో ఒకరి పరిస్థితి విషమం

నేరేడుచర్ల : మిషన్ భగీరథ పైపులైన్‌ను ఓ కారు ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు కాగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని రామగిరి వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కడప జిల్లా చెన్నూరు మండలం బైనపల్లి కొండపేట గ్రామానికి చెందిన నార చినకృష్ణారెడ్డి(48) ఆయన భార్య శశికళ (41), కుమార్తెలు ప్రణవి(17), జాహ్నవి(15) కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మంలో 15ఏళ్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. తన స్వగ్రామమైన బైనపల్లి కొండపేట నుంచి ఖమ్మంకు కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కారులో బయలుదేరాడు. మార్గమధ్యంలోని నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామగిరి వద్ద రాగానే కారు అదుపుతప్పి మిషన్ భగీరథ పైపులైన్‌ను ఢీకొట్టింది. దీంతో కారు పల్టీ కొట్టడంతో కారులో ఉన్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారిని 108లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కృష్ణారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

భార్య మృతికి కారణమైన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

చిట్యాల: భార్య మృతికి కారణమైన భర్తకు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ కోర్టు అసిస్టెంట్స్ సెషన్స్ జడ్జి తోజే కార్తీక్ తీర్పునిచ్చినట్లు చిట్యాల ఎస్ఐ ఎన్.ధర్మా బుధవారం తెలిపారు. కేసుపై ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన జోగి కృష్ణయ్య అలియాస్ కృష్ణతో కట్ట రాములు కుమార్తె అండాలుకు 2006లో వివాహం జరిగింది. వివాహ సమయంలో కృష్ణకు రూ.1.20లక్షలు కట్నంగా అందజేశారు. ఏడాది పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. అనంతరం భార్యపై అనుమానం పెంచుకున్న కృష్ణ ఆమెను మానసికంగా శారీరకంగా వేధించాడు. దీంతో భర్త వేధింపులకు మనస్తాపం చెందిన అండాలు 2013 డిసెంబర్ 16న ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే నెల 21న మృతిచెందింది. దీంతో మృతురాలి తండ్రి అదే రోజున చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ వివరించారు. సరైన ఆధారాలు సేకరించి కోర్టుకు సమర్పించిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్. మోహన్‌బాబు, యాదగిరి, ఎస్ఐ ధర్మా, పీపీ జయరాంనాయక్‌ను ఎస్పీ అపూర్వరావు అభినందించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

వలిగొండ : భువనగిరి ఎస్వోటీ పోలీసులు దాడులు చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం కొండ మెట్ల దారిలో కొందరు రహస్యంగా పేకాట ఆడుతున్నారని ఎస్వోటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించి అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.81వేలు ఐదు సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

చింతపల్లి : వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. చింతపల్లి, నార్కట్‌పల్లి, యాదగిరిగుట్ట మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనలపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండలం మాల్ వెంకటేశ్వర నగర్‌కు చెందిన పున్న ఆంజనేయులు(59) గ్రామంలోని దర్జీగా జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య, పిల్లలు నాలుగేళ్ల నుంచి దూరంగా ఉంటున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆంజనేయులు మూడు రోజుల క్రితం తాను పనిచేస్తున్న దుకాణంలోనే పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి ఆంజనేయులు కనబడకపోవడంతో బుధవారం అతని తమ్ముడి కుమారుడు అనుమానం వచ్చి దుకాణం వద్దకు వెళ్లాడు. దుర్వాసన వస్తుండడంతో దుకాణం తెరవగా ఆంజనేయులు మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని ఎస్ఐ బాలకృష్ణ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి..



చంద్రారెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామానికి చెందిన రెగట్టె చంద్రారెడ్డి (45) ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. చంద్రారెడ్డి కొన్నేళ్లుగా చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబంలో జరుగుతున్న తగాదాలతో చంద్రారెడ్డి మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లోనుంచి బయటికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా, బుధవారం మండల పరిధిలోని శేరుబావిగూడెం సమీపంలో రైల్వే పట్టాల పక్కన చంద్రారెడ్డి బైక్ కనిపించింది. గ్రామస్తులు గమనించగా రైలు పట్టాలపై చంద్రారెడ్డి మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే కానిస్టేబుల్ రజిత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట నుంచి మల్లాపురం వెళ్లే ప్రధాన రహదారిలో గల ప్రగతి వెంచర్ సమీపంలో రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఇంకా లభించలేదని, కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలియజేశారు.

సర్పంచ్‌పై కేసు

మోతె : మోతె మండలం గోపతండా సర్పంచ్‌తో పాటు మరొకరిపై బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. గోపతండా సర్పంచ్ కొర్ర తిరుపతి, డ్రైవర్ సురేష్‌తో కలిసి మంగళవారం మండల కేంద్రం నుంచి ట్రాక్టర్‌పై 950 కిలోల నల్లబెల్లం, 50 కిలోల పటిక, 22 లీటర్ల సారాను తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు ట్రాక్టర్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సర్పంచ్ తిరుపతి, డ్రైవర్ సురేష్ ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ అప్సర్ అలీని ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం తిరుపతి, సురేష్ ట్రాక్టర్‌ను వదిలి అక్కడినుంచి పారిపోయారు. ఆ ట్రాక్టర్‌ను ఎక్సైజ్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. బుధవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

దారి దోపిడీకి పాల్పడుతున్న ఏడుగురి అరెస్ట్

- ద్విచక్రవాహనదారులే టార్గెట్‌గా చేసుకుని దాడులు
- నిందితులను కోర్టులో హాజరుపర్చిన అనంతగిరి పోలీసులు

అనంతగిరి : రోడ్డు మీద వెళ్తున్న అమాయక ద్విచక్ర వాహనదారులే టార్గెట్‌గా చేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్న ఏడుగురు ముఠా సభ్యులను అనంతగిరి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన షేక్ ఆసీఫ్, మౌలాలీ, షేక్ అబ్దుల్లా, ప్రశాంత్, గోపిరెడ్డినగర్‌కు చెందిన శీలం శ్రీరామ్, బంజారకాలనీకి చెందిన ఆఫ్రీది, నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన బసవబోయిన గోపికృష్ణ ఓ ముఠాగా ఏర్పడి దోపిడీలకు పాల్పడుతున్నారు.

ప్రయాణికుల వలే నిల్చొని..

ఈ ముఠా సభ్యులు కోదాడ బైపాస్‌రోడ్డులోని దుర్గాపురం స్టేజీ వద్ద వీరు సాధారణ ప్రయాణికుల వలే నిల్చొని అటుగా వచ్చిన ద్విచక్రవాహనదారులను లిఫ్ట్ అడుగుతారు. ఇదే ముఠా సభ్యులు కిలోమీటర్ దూరంలో మరో చోట రోడ్డు మీద నిల్చొని ఉంటారు. వారి వద్దకు ఈ ద్విచక్రవాహనదారుడు వెళ్లగానే వెనుక కూర్చున్న వ్యక్తి తమ స్నేహితులు వారేనని వాహనం ఆపమని కోరుతాడు. ఆ వెంటనే వీరంతా సదరు ద్విచక్ర వాహనదారుడిపై దాడి చేసి అతని వద్ద ఉన్న డబ్బులు, సెల్‌ఫోన్, బంగారు వస్తువులను లాక్కొని పరారవుతారు.

బాధితుల ఫిర్యాదుతో..

జగ్గయ్యపేటకు చెందిన దుప్పల నరసింహారావు, అతని స్నేహితుడితో కలిసి ఈ నెల 11న రాత్రి 11:30 గంటల సమయంలో కోదాడ బైపాస్‌రోడ్డులోని దుర్గాపురం స్టేజీవద్ద నుంచి బైక్‌పై వెళ్తున్నారు. ఈ ముఠా సభ్యులు వారిని అడ్డగించి వారి వద్ద ఉన్న రూ.15,500 నగదు, సెల్‌ఫోన్, బంగారపు చైన్ లాక్కొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిఘా పెట్టడంతో నిందితులు పట్టుబడినట్లు సీఐ వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా దుర్గాపురం జంక్షన్

కోదాడ శివారులో బైపాస్ రోడ్డు కలిసే చోట వద్ద ఉన్న దుర్గాపురం జంక్షన్ అసాంఘిక కార్యకలాపాలకు ప్రధాన అడ్డాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. రాత్రి 10గంటలు దాటిందంటే ఇక్కడి నుంచి వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధికి మధ్య ఉన్న రెండు కిలోమీటర్లు అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంది. ప్రస్తుతం దుర్గాపురం జంక్షన్ అనంతగిరి పరిధిలో ఉండడంతో సదరు స్టేషన్ ఈ ప్రాంతానికి 10కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఈ ప్రాంతంపై నిఘా తగ్గిపోయింది. దీంతో ఈ ప్రాంతాన్ని కొందరు నేరగాళ్లు అడ్డాగా మార్చుకున్నారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో హిజ్రాల ఆగడాలు, వ్యభిచార ముఠాల కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రాంతం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉన్నందున దీనిని టౌన్‌స్టేషన్ పరిధిలో కలిపి నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు.